ఆలయాల అభివృద్ధికి కృషి



ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న శ్రీగణేశ్, జంపన ప్రతాప్

కంటోన్మెంట్: ఆలయాల అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందజేస్తానని కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేశ్ అన్నారు. ఆరోవార్డు పరిధిలోని శివ పంచాయతన ఆదిత్య నవగ్రహ దేవాలయ 22వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆలయ కమిటీ అధ్యక్షులు శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విశేష పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీగణేశ్ మాట్లాడుతూ.. ఆలయం నిర్మించిన అనతికాలంలో భక్తుల ఆదరణను చూరగొనడంలో కమిటీ పాత్ర ఎంతో ఉందన్నారు. ఇలాంటి ఆలయ అభివృద్ధికి తాను కూడా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, అరుణ్ యాదవ్, బాలరాజు యాదవ్, మాల్యాద్రి, దేవాలయ కమిటీ ఉపాధ్యక్షులు శేఖర్, సెక్రటరీ సాయిబాబా యాదవ్, జి కృష్ణ, విజయరాజు, కోశాధికారి నాగభూషణం, కమిటీ సభ్యులు గోపాల్ గౌడ్, సత్యనారాయణ రాజు, చంద్రమౌళి, గోవర్ధన్, కృష్ణ, సాంబమూర్తి పాల్గొన్నారు.

ఆడ పిల్లల సంరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో పాల్గొన్న వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

అడ్డగుట్ట: బాలికల ఉచిత ఉన్నత విద్యకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా చూడాలని, అప్పుడే వారి హక్కులను కాపాడిన వాళ్లవుతామన్నారు. అదే విధంగా బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంటుందన్నారు. ప్రతి రోజు ఎక్కడో ఒక చోట ఆడపిల్ల అవమానం, హింసలకు గురవుతుందన్నారు. తమ హక్కులను కాపాడుకునేందుకు ఆడపిల్లలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. మండల కన్వీనర్‌గా ప్రవళిక, కోకన్వీనర్ అనుష, మధు, కార్యదర్శి ఎస్.కే. తబసుంతో పాటు 25 మందితో కమిటీ ఏర్పాటు చేశారు. భాగ్యలక్ష్మి, ఎం.వి ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఏవీఎం. స్వామి, చింతల లక్ష్మీనారాయణ, ప్రవీణ్, సువర్ణ, భాగ్య, లావణ్య, సుమలత, సౌజన్య, కంతిరేఖ, బాలికలు వైష్ణవి, పూజ, కార్తీక, రాధిక, మౌనిత పాల్గొన్నారు.

'అమృత్'తో కంటోన్మెంట్ అభివృద్ధి



రెండో వార్డులో పర్యటించిన రామకృష్ణ, సీఈఓ మధుకర్ నాయక్

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో అమృత్ పథకం అమలు ద్వారా రూ.100 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని బోర్డు సభ్యులు రామకృష్ణ తెలిపారు. బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్, కంటోన్మెంట్ ఇంజినీర్ ఫణికుమార్‌తో కలిసి రెండో వార్డు పరిధిలోని ఇందిరమ్మ నగర్, బీరప్ప ఆలయం, నాగమ్మ ఆలయం, పెద్ద రోడ్, సీబీఎస్‌నగర్‌లో పర్యటించారు. వార్డు పరిధిలో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. అమృత్ పథకం నిధులతో రెండో వార్డుతో పాటు కంటోన్మెంట్ వ్యాప్తంగా పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో ముందుజాగ్రత్త చర్యలు చేపడతామన్నారు. ముఖ్యంగా నాలాల్లో పూడికను పూర్తిగా తొలగించడం ద్వారా ముంపు సమస్యను నివారిస్తామన్నారు. అందులో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

జాబ్‌మేళాతో నిరుద్యోగులకు మేలు



ఎంపికైన వారికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ, ఆంజనేయులు

కవాడిగూడ: జాబ్‌మేళాతో నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందని గాంధీనగర్ సీఐ రాజు అన్నారు. కవాడిగూడ డివిజన్‌లోని విరజానంద విజ్ఞానకేంద్ర ఆర్యసమాజ్ కవాడిగూడ, ఆరైజ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాబ్‌మేళాకు 224 మంది నిరుద్యోగులు హాజరుకాగా దాదాపు 74 మంది యువతీ యువకులు ఎంపిక కాగా కవాడిగూడ కార్పొరేటర్ జి. రచన శ్రీ వారికి అపాయింట్‌మెంట్ లెటర్స్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలకోసం ఎదురు చూడకుండా ఇలాంటి జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని సూచించారు. ఈ సందర్భంగా జాబ్‌మేళా నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో విరజానంద వైదిక్ విద్యాలయ అధ్యక్షుడు పి. జనార్దన్, కార్యదర్శి గడిల ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శి వనజకుమార్, ఆర్ఎస్ఎస్ సికింద్రాబాద్ విభాగ్ కార్యదర్శి భరతపూడి శ్రీనివాస్, అరైజ్ ఫౌండేషన్ డైరెక్టర్ నీలకంఠ మహాదేవ్, సెక్రటరీ ప్రవీణ్, కోశాధికారి సీత, సంతోష్, సంజీవ, శంకర్, మనోహర్, శ్రీకాంత్, స్వాతి, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి. వెంకటేశ్, డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శులు ఎ. ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, బీజేపీ నేతలు నర్సింహాచారి, బొల్ల రమేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌తో అవస్థలు!

- ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాల నిలిపివేత
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



బౌద్ధనగర్‌లో రోడ్డు పక్కన నిలిపిన వాహనాలు

బౌద్ధనగర్: డివిజన్‌లోని ప్రధాన రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు, పాదచారులు వాపోతున్నారు. వారాసిగూడ ప్రధాన రోడ్డు మార్గంలో ఇరువైపులా పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. రోజులు తరబడి అక్కడే ఉంటుండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా స్పందించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు సైతం హడావిడి చేసి వెళ్లిపోతున్నారని ఆ తర్వాత సమస్య పునరావృతం అవుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ స్తంభించి అప్పుడప్పుడూ ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంబులెన్స్‌కూ దారి లేని దుస్థితి..

రోడ్లపై ఇష్టానుసారంగా పార్కింగ్ కారణంగా అత్యవసర సమయాల్లో బస్తీలోకి వచ్చే అంబులెన్స్ కూడా పోయేందుకు సరైన మార్గం ఉండడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాల్సిన ట్రాఫిక్ పోలీసులు దీని దృష్టి సారించకపోవడం అనుమానాలకు దారి తీస్తోంది. వారాసిగూడ, అంబర్‌నగర్, పార్శిగుట్ట తదితర ప్రాంతాల్లో రోడ్లపై చేస్తున్న వాహనాల పార్కింగ్‌లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఇక్కడ అధికంగా మోటర్ డ్రైవింగ్ స్కూల్స్ ఉంటాయి. ఈ డ్రైవింగ్ స్కూళ్లకు చెందిన వాహనాలన్నీ రోడ్లపై పార్క్ చేసి వెళ్లిపోతారు. ఒక్కో డ్రైవింగ్ స్కూల్‌కు సుమారు మూడు నుంచి నాలుగు వాహనాలు ఉంటాయి. వీటి పార్కింగ్‌తో కూడా రోడ్లపై ట్రాఫిక్ జామ్‌తో పాటు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

వాహనాలను సీజ్ చేయాలి..

నిత్యం ట్రాఫిక్ జామ్, ఇతరత్రా ప్రమాదాలకు కారణంగా మారుతున్న అక్రమ పార్కింగ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కేవలం ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తినప్పుడే వచ్చే ట్రాఫిక్ పోలీసులు వాటిని నియంత్రించే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని చెబుతున్నారు. రోడ్లపై ఇష్టానుసారంగా పార్కింగ్ చేసే వాహనాలను సీజ్ చేసి యజమానులపై కేసులు నమోదు చేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తోందని స్థానికులు, పలువురు వాహనదారులు కోరుతున్నారు.

31న వార్షిక వేడుకలు

చిక్కడపల్లి: ఈ నెల 31న శ్రీ భారతి మ్యూజిక్ అకాడమీ 24వ వార్షిక వేడుకలను శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చింతలపాటి సురేశ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డు జడ్జి జస్టిస్ నాగమారుతీశర్మ హాజరై శ్రీ భారతి ఫౌండేషన్ లోగో ఆవిష్కరిస్తారన్నారు. అలాగే ప్రముఖ లలిత సంగీత స్వరకర్త ములగలేటి గోపాలాకృష్ణను శ్రీభారతి జీవన సాఫల్యపురస్కారంతో సత్కరించి లలితసంగీత భారతి బిరుదును ప్రదానం చేస్తారని తెలిపారు. కవి డాక్టర్ ఎంకె రాము అధ్యక్షత వహించే సభలో తిరుమల గ్రూప్ చైర్మన్ నుంగునూరి చంద్రోఖర్, ప్రముఖులు రాజేశ్వర్‌రెడ్డి, వడ్డి సుబ్బారావు, ఎన్‌సీ శ్రీనివాస్ తదితరులు అతిథులుగా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో శ్రీ భారతీయం పేరిట సురేశ్ నిర్వహణలో సురేఖ, వీకే దుర్గ ఆమని అమృతవల్లి తదితరులుతో ఆధ్యాత్మిక, సామాజిక, తత్వప్రబోధ చైతన్య గీతాల గాన విభారి ఉంటుందని ఆయన చెప్పారు.

'ఫోన్ ట్యాపింగ్‌లో మాజీ సీఎం శిక్షార్హుడే'

కాచిగూడ: ఫోన్ ట్యాపింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్ శిక్షార్హుడని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి సూదమల్ల వెంకటస్వామి అన్నారు. నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో నేతలు గోరశ్యామ్ సుందర్, మాదరబోయిన నర్సయ్యతో కలిసి మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలను అదుపులోకి తెచ్చుకొనే ఆలోచనలతో అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు మాజీ పోలీసు అధికారులు ఇప్పటికే చెప్పారన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానులేనని, వారిని శిక్షించాల్సిందేనని డిమాండ్ చేశారు.

అంకితభావంతో పనిచేసేవారికి గుర్తింపు

చిక్కడపల్లి: అంకితభావంతో పనిచేసేవారికి గుర్తింపు లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెనడీ అన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్న ఆ పార్టీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్‌ను మంగళవారం సాయంత్రం నేతలు సన్మానించారు. అభిషేక్ కెనడీ మాట్లాడుతూ పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు.

బీసీ రిజర్వేషన్ల పెంపు తర్వాతే స్థానిక ఎన్నికలు

కాచిగూడ: తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, టి.రాజ్‌కుమార్, నిరంజన్, నిఖిల్ లతో కూడిన ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర పంచాయతి రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రం అందజేసింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కులగణన జరిపిన తర్వాత బీసీల పంచాయతీరాజ్ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 29 శాతం నుంచి బీసీల జనాభా ప్రాతిపదికన 50 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. క్రిమిలేయర్‌ను తొలగించాలని, ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న 11 ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని అమలు చేస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు.

కనుల పండువగా రథోత్సవం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారిని రథోత్సవంపై అధిరోహించారు. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు ఆలయ వంశీకుడు గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయుల ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, రక్షాబంధనం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, మహానివేదన, మంత్ర పుష్పం వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం పతాధివాసం, హవనం, భేరిపూజ, దేవతాహ్వానం, హవననం, బలిహరణనం నిర్వహించారు. అలాగే ఆలయంలో లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలు నిర్వహించారు. కాగా బుధవారం పూర్ణాహుతి, చక్రతీర్థం, ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగం, దేవతోద్వాసన ఉంటుందన్నారు. గురువారం ఘటాభిషేక కార్యక్రమాన్ని 81 కలశాలతో జరుగుతుందని, ఈ సందర్భంగా స్వామి వారి వెండిపూత ఘటాభిషేక అష్టలక్ష్మి కలశాలను ఇస్తామన్నారు. అదే రోజు రాత్రి స్వామి వారి శృంగార డోలోత్సవం అనంతరం వేదపండితులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని వారు పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో నగదు పంపుతానని మోసం

వెంగళరావునగర్: ఆన్‌లైన్‌లో నగదు పంపుతానని యువకుడి వద్ద నగదు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... వినుకొండకి చెందిన తోట మోహన్ శ్రీకృష్ణానగర్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటున్నారు. ఈ నెల 27న మధురానగర్ మెట్రో వద్ద ఉన్న ఎస్‌బీఐ వద్దకు వెళ్లి రూ.24 వేలు డిపాజిట్ చేయడానికి ప్రయత్నించగా క్యాష్ తనకు ఇస్తే ఆన్‌లైన్‌లో వేస్తానని చెప్పాడు. దాంతో మోహన్ ఆ నగదును సాయికి ఇచ్చాడు. దానిని తీసుకుని సాయి పారిపోయాడు. బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

వేర్వేరు ఘటనల్లో సెల్‌ఫోన్ల చోరీ

వెంగళరావునగర్: రెండు వేర్వేరు ఘటనల్లో సెల్‌ఫోన్లు దొంగతనానికి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. అమీర్‌పేటలో నివసించే దుర్గారావు సోమ వారం తెల్లవారుజాము భద్రాచలం నుంచి వస్తున్న తన స్నేహితురాలిని పికప్ చేసుకోవడానికి మైత్రీవనం వచ్చాడు. ఫోన్‌లో మాట్లాడుతుండగా ఇరువురు యువకులు వచ్చి లాక్కెళ్లారు. చింతల్ ప్రాంతంలో ఉండే ఓం శ్రీనివాస్ మంగళవారం అర్ధరాత్రి గుంటూరు నుంచి వస్తున్న భార్యను రిసీవ్ చేసుకునేందుకు మైత్రీవనం వచ్చాడు. ఈ క్రమంలో ఫోన్‌లో మాట్లాడుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఫోన్ లాక్కుని పారిపోయారు. దాంతో ఇరువురు బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: ఉస్మానియా యూనివర్సిటీ, మోండా మార్కెట్, పాటిగడ్డ, కిమ్స్, లాలాగూడ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రవీంద్రనగర్ ఫీడర్ పరిధిలోని మోడల్ స్కూల్, దోబీఘాట్, ఈఎఫ్ఎల్, మాణికేశ్వరీనగర్, పాలికా బజార్, సౌత్ ఇండియా చర్చ్, ప్రకాష్ హాస్పిటల్, ఓల్డ్ గాంధీ ఆస్పత్రి, అఫ్జల్‌అల్లావుద్దీన్ క్రిస్టల్ ప్రాంతాలు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2.30 గంటల వరకు కేశవనగర్, హనుమాన్ టెంపుల్ ఫీడర్ పరిధిలోని అంబేద్కర్‌నగర్, డబుల్ బెడ్రూమ్, జస్టా హోటల్, మోక్షా హోటల్, పీఎం మోదీ కాంప్లెక్స్, సుందరం మోటర్స్, హనుమాన్ టెంపుల్, బుద్ధభవన్ ప్రాంతాలు. బాపూబాగ్, తార్నాకా ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు కృష్ణానగర్, సిద్ధివినాయక, ఫుడ్ వరల్డ్, మారుతి కన్‌స్ట్రక్షన్, పోచంపల్లి, సింధీకాలనీ, ఎయిర్‌లైన్స్ టవర్, పీజీరోడ్, సయ్యద్ అబ్దుల్లా, డొమెనిక్ మోడల్ హైస్కూల్, పోచమ్మ టెంపుల్, సాయి సదన్ అపార్ట్‌మెంట్, నారాయణ జూనియర్ కాలేజ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

బేగంపేట్ సబ్‌స్టేషన్ పరిధిలో..

సనత్‌నగర్: బేగంపేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని గవర్నమెంట్ స్కూల్, శాంతిబాగ్, ఎస్ఆర్‌నగర్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు ఎస్ఆర్‌నగర్, బీ–టైప్ క్వార్టర్స్, 2ఆర్‌టీ క్వార్టర్స్, మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు డీకేరోడ్డు, బీజేఆర్‌నగర్, మసీదు గల్లీ, కేకే జోన్ హోటల్. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు బల్కంపేట్, సైంటిఫిక్ కాలనీ, బీకేగూడ మెయిన్‌రోడ్డు, గాయత్రీ సూపర్ మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

బస్తీ దవాఖానా సందర్శన



దవాఖానాను సందర్శించిన కార్పొరేటర్, ఎస్‌పీహెచ్‌ఓ

బౌద్ధనగర్: అంబర్‌నగర్‌లోని బస్తీ దవాఖానాను ఎస్‌పీహెచ్‌ఓ సక్కుబాయితో కలిసి స్థానిక కార్పొరేటర్ కంది శైలజ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. బస్తీదవాఖానాలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని ఎళ్లవేళలా తాము అందుబాటులో ఉంటామన్నారు.

పాత నేరస్తుడి అరెస్ట్

అమీర్‌పేట: దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని అరెస్టు చేసిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డీఐ జానకి రాములు వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ తాడిపత్రి గాంధికట్ట శ్రీరాములుపేటకు చెందిన వాయులు వారి బాలగోవింద్ (22) రెండు నెలల క్రితం నగరానికి వచ్చి దాసారం బస్తీ గుడిసెల్లో ఉంటున్నాడు.చెడు అలవాట్లతో పాటు తాగుడుకు బానిసై దొంగతనాలకు అలవాటు పడ్డాడు. తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రుల్లో చోరీలకు పాల్పడుతున్నాడు. ఎస్ఆర్‌నగర్ స్టేషన్ పరిధిలోనే నాలుగు ఇళ్ల తాళాలు పగల గొట్టి బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. దాసారం బస్తీ గుడిసెల్లోనే ఉండే పిచ్చకుంట్ల సుంకప్ప (36), పిచ్చకుంట్ల సురేందర్ సహకారంతో దొంగిలించిన సొత్తును సనత్‌నగర్ ఎస్ఆర్‌టీ–178లో ఉండే పాన్‌బ్రోకర్ అశోక్‌కుమార్ జైన్ (41)కు విక్రయించారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలగోవింద్‌తో పాటు అతడికి సహకరిస్తున్న వారిని అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాంగోపాల్‌పేట్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ జాన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 21న ఎస్పీరోడ్‌లోని స్విమ్మింగ్ పూల్ ప్రాంతంలో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు 108 సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించాడు. అనారోగ్య కారణాలతో మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే మహంకాళి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

యువతి అదృశ్యం



శాంతిప్రియ

అడ్డగుట్ట: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. తుకారాంగేట్‌లోని శాస్త్రినగర్‌కు చెందిన శాంతి ప్రియ(20) ఈ నెల 28న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి రాత్రైనా తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముడేసి పడేస్తున్నారు!



రోడ్లపై చెత్త వేయొద్దంటూ వివిధ రకాలుగా జీహెచ్ఎంసీ అధికారులు అవగాహన కల్పిస్తున్నా కొందరి నిర్లక్ష్యంతో రోడ్లన్నీ చెత్తమయంగా మారుతున్నాయి. సనత్‌నగర్ ఆరేకే స్వీట్స్ ఎదురుగా హిందూ పబ్లిక్ స్కూల్‌కు వెళ్లే రహదారిలో ట్రాన్స్‌ఫార్మర్ ఇష్టానుసారంగా చెత్త వేస్తుండటంతో దుర్గంధంగా మారుతోంది. పారిశుద్ధ్య సిబ్బంది ఇక్కడ దృష్టి సారించకపోవడంతో ఇదే అదునుగా భావించిన కొందరు ప్లాస్టిక్ కవర్లతో చెత్తవేసి ఇక్కడే వేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

–సనత్‌నగర్

ఆగిపోయిన పనులు..

కలుషితమవుతున్న తాగునీరు!

మాణికేశ్వర్‌నగర్‌లో స్థానికుల ఘర్షణతో అర్ధంతరంగా తాగునీటి పైప్‌లైన్ పనులు

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలోని మాణికేశ్వర్ నగర్(వడ్డెరబస్తీ)లో గత కొంతకాలంగా తాగునీటి కలుషిత సమస్య వెంటాడుతోంది. రోజు విడిచి రోజు వచ్చే తాగునీరు బురదతో కూడిన నల్లని నీరు సరఫరా అవుతుంది. ఈ నీరు తాగి ఇప్పటికే పలువురు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై స్థానికులు జలమండలి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో సిబ్బంది పైపులైన్‌కు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ క్రమంలో ఇళ్ల మధ్య రాకపోకలకు ఇబ్బందిగా ఉందంటూ కొందరు అభ్యంతరం తెలుపగా స్థానికుల్లో ఘర్షణ తలెత్తింది. దీంతో ఆ పనులను అర్ధంతరంగా వదిలేసి వెళ్లిపోయారు. పనులు ఆగిపోవడంతో గత 10 రోజుల నుంచి తాగునీరు లేక ఇబ్బందులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్థానికులతో చర్చించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని బస్తీవాసులు కోరుతున్నారు.



